సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ; 12 ; జూలై ; 2025



గోతుల యాతన తీరేదెన్నడు?

ఏలూరులో రోడ్లన్నీ గోతులమయం. ఏదో గోతిలో పడి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. వర్షం పడితే ఏది గొయ్యో, ఏది గొప్పో తెలియడం లేదు. 8లో ▸



నిరాహార దీక్ష అడ్డగింత

పెనుమంట్ర దళితవాడలోని ఎలిమెంటరీ పాఠశాలను విలీనం చేయడం నిరసిస్తూ సర్పంచ్ ప్రియాంక దంపతులు చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. 8లో ▸



డ్రోన్ల వినియోగంపై శిక్షణ

వ్యవసాయ రంగంలో ఇటీవల డ్రోన్ల వినియోగం పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమం ద్వారా డ్రోన్ల వినియోగంపై శిక్షణకు శ్రీకారం చుట్టారు. 8లో ▸

బడుగులకు మొండిచేయి

- ఏఎంసీ ఛైర్మన్ల రిజర్వేషన్లలో ఎస్టీ, మైనార్టీలకు దక్కని చోటు
- కావాల్సిన వారికి కట్టబెట్టుకునేందుకు కూటమి నేతల ఒత్తిళ్లు
- ఆ మేరకు రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ల సవరణ
- గత ప్రభుత్వంలో సామాజిక న్యాయం పాటిస్తూ రిజర్వేషన్ల అమలు



భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి, భీమవరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ల రిజర్వేషన్లలో ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. జిల్లాలో పది ఏఎంసీలు ఉండగా వీరికి ఎక్కడా స్థానం కల్పించలేదు. ఐదు జనరల్‌కు, మూడు బీసీ, రెండు ఎస్సీలకు కేటాయించారు. తొలుత భీమవరం ఏఎంసీ ఎస్టీ మహిళ, నరసాపురం బీసీ మైనార్టీకి కేటాయించగా కూటమి నేతల ఒత్తిళ్ల మేరకు మార్పులతో రివైజ్డ్ జాబితాను విడుదల చేసినట్టు తెలుస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పది ఏఎంసీలు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వీటి నుంచి ప్రభుత్వానికి ఏడాదికి రూ.65.98 కోట్ల ఆదాయం సమకూరుతోంది. రూ.15.6 కోట్ల ఆదాయ ఆర్జనతో భీమవరం మొదటిస్థానంలో ఉండగా రూ.12.45 కోట్లతో ఉండి రెండో స్థానంలో ఉంది. అత్తిలి రూ.2.75 కోట్లు, ఆచంట రూ.1.91 కోట్లతో చివరి స్థానాల్లో ఉన్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత స్థానం ఏఎంసీ చైర్మన్‌దే. ఈ పదవి కోసం ఎంతోమంది ఆశావహులు ఉంటారు.

ఒత్తిడి మేరకు రిజర్వేషన్లలో మార్పు

జీఓ నెంబర్ 77 ప్రకారం మొత్తం స్థానాల్లో 50 శాతం జనరల్‌కు రిజర్వు చేయగా, మిగిలిన 50 శాతంలో బీసీ, మైనార్టీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం సర్దుబాటు చేయాలి. ఈ నెల 8న జిల్లాలోని ఏఎంసీ చైర్మన్ల పదవికి జిల్లా యంత్రాంగం రిజర్వేషన్లు ఖరారు చేసింది. జిల్లా యూనిట్‌గా జనాభా ప్రాతిపదికన వీటిని రూపొందించినట్టు సమాచారం. రెండు ఏఎంసీలకు ఓసీ జనరల్, రెండు చోట్ల ఓసీ మహిళ, ఒకటి బీసీ మహిళ, ఒకటి బీసీ జనరల్, ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్సీ జనరల్, భీమవరం ఎస్టీ మహిళ, నరసాపురం బీసీ మైనార్టీకి కేటాయించారు. ఈ జాబితా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.

భీమవరం, నరసాపురంలలో ఏఎంసీ చైర్మన్ పదవులకు టీడీపీ, జనసేనలోని అగ్రవర్ణాల నుంచి తీవ్ర పోటీ ఉంది. చైర్మన్ల విషయంలో ఇప్పటికే రెండు చోట్ల కూటమి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఆచంట ఏఎంసీకి సంబంధించి గతంలోనే బీసీల నుంచి టీడీపీ నాయకత్వం అభ్యర్థిని దాదాపు ఖరారు చేసింది. రిజర్వేషన్లు బెడిసికొట్టడంతో ఆశావాహుల గొంతులో పచ్చివెలక్కాయ పడింది. ఆయా నియోజకవర్గాల కూటమి నేతలు తమకు అనుకూలంగా రిజర్వేషన్ల మార్పు కోసం ఉన్నతస్థాయి నుంచి జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. దీంతో రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని నేతలకు అనుకూలంగా అదే రోజు రివైజ్డ్ జాబితాను విడుదల చేసినట్టు తెలుస్తోంది. ఈ రిజర్వేషన్ల మేరకు ఎమ్మెల్యేలు సూచించిన పేర్లతో తణుకు ఏఎంసీ చైర్మన్‌గా కొండేటి శివ, అత్తిలికి దాసం ప్రసాద్, తాడేపల్లిగూడెంకు చాపల మంగాబాయి, పాలకొల్లుకు కోడి విజయభాస్కర్, ఆకివీడుకు బొల్ల వెంకట్రావు చైర్మన్లుగా ప్రతిపాదిస్తూ ఆమోదం కోసం మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

గతంలో పారదర్శకంగా..

పాలనలో బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన జగన్ సర్కారు రిజర్వేషన్ల అమలులో వారికి సముచిత స్థానం కల్పించి అందరికి సమన్యాయం చేశారు. నిబంధనలు మేరకు ఐదు జనరల్‌కు, రెండు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు, బీసీలకు కేటాయించిన రెండింటిలో ఒకటి మైనార్టీకి రిజర్వు చేశారు.

ఏఎంసీ	2023లోని రిజర్వేషన్లు	రెండ్రోజుల క్రితం	రివైజ్ చేసిన తర్వాత
ఆకివీడు	బీసీ (మైనార్టీ మహిళ)	బీసీ (మహిళ)	బీసీ
అత్తిలి	ఓసీ	ఓసీ (మహిళ)	ఓసీ
భీమవరం	ఓసీ	ఎస్టీ (మహిళ)	ఓసీ (మహిళ)
పాలకొల్లు	ఎస్టీ (మహిళ)	బీసీ	బీసీ
పెనుగొండ	ఓసీ (మహిళ)	ఓసీ	ఓసీ
తాడేపల్లిగూడెం	ఎస్సీ	ఓసీ (మహిళ)	ఎస్సీ (మహిళ)
తణుకు	ఎస్సీ (మహిళ)	ఎస్సీ	ఎస్సీ
ఉండి	ఓసీ	ఓసీ	ఓసీ
ఆచంట	ఓసీ	ఎస్సీ (మహిళ)	బీసీ (మహిళ)
నరసాపురం	బీసీ	బీసీ (మైనార్టీ)	ఓసీ

చిన్నచూపు తగదు



ముందుగా వచ్చిన జాబితాలో భీమవరం ఏఎంసీ ఎస్టీ మహిళకు రిజర్వు చేశారు. తర్వాత రివైజ్ చేసి ఓసీ మహిళకు మార్పుచేశారు. ఎస్టీలకు జిల్లాలో ఎక్కడా కేటాయింపు చేయకపోవడం తగదు. గత ప్రభుత్వంలో నిబంధనలు మేరకు ఎస్టీలకు చైర్మన్ పదవి ఇచ్చారు.

– సాలా శ్రీనివాస్, ఎరుకల సంఘం భీమవరం రూరల్ అధ్యక్షుడు

మైనార్టీలపై చిన్నచూపు



మైనార్టీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. నరసాపురం ఏఎంసీ చైర్మన్ పదవిని ముందుగా మైనార్టీలకు కేటాయించి, ఒక్కరోజులో మళ్లీ రిజర్వేషన్ మార్చడం దారుణం. ఈ ఏఎంసీ పదవిని ఇంతవరకూ ముస్లిం మైనార్టీలు చేపట్టలేదు. మొదటిసారి ఓ ముస్లిం ఆ పదవిలో చూద్దామని ఆశపడ్డ మాకు ఒక్కరోజులోనే అసంతృప్తి మిగిల్చారు.

– ఎండీ బాషా ఖాన్, నరసాపురం

న్యూస్‌రీల్

కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: రంగరాయ కాలేజీలో లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలు విద్యా సంస్థకు వెళ్లాలన్నా, రోడ్డుపై తిరగాలన్నా, ఆస్పత్రికి వెళ్లినా అక్కడ కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా మల్లిఖార్జునుడు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాల వద్ద ఉద్రిక్తత

భీమవరం: భీమవరం పట్టణంలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాల వద్ద ర్యాగింగ్ అంటూ కలకలం రేగింది. బైపాస్ రోడ్డులోని ఈ జూనియర్ కళాశాలలో ఈ నెల 5న జూనియర్, సీనియర్ విద్యార్థుల వద్ద టాయిలెట్ల వద్ద వివాదం ఏర్పడింది. వివాదానికి కారణమైన ఏడుగురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసినట్లు తెలిసింది. బాధిత విద్యార్థుల్లో ఒక విద్యార్థి తండ్రి శుక్రవారం కళాశాలకు చేరుకుని వివాదం వివరాలు తమకెందుకు చెప్పలేదంటూ కళాశాల ప్రిన్సిపల్‌ను నిలదీశారు. దీంతో కళాశాల వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడినట్లు తెలిసింది. దీనిపై ఇంటర్మీడియట్ జిల్లా అధికారి జి.ప్రభాకరరావును వివరణ కోరగా వివాదం తన దృష్టికి రాలేదని, వివరాలు తీసుకుంటానన్నారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి



ఎమ్మెల్యే కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్తున్న హమాలీ కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో మర్చంట్ అండ్ ఛాంబర్ పరిధిలో హమాలీ కార్మికులకు కూలీ రేట్ల పెంపుదలలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని కోరుతూ ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలు నుంచి విజ్ఞాపన యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయం వద్దకు పదర్శన చేశారు. ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూలి రేట్ల పెంపుదల విషయంలో సానుకూలంగా ఉండాలన్నారు. ఐఎఫ్‌టీయు ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కూలి రేట్ల పెంపుదల కాల పరిమితి ముగిసినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని, అది సరి కాదన్నారు.

రైళ్లలో ప్రత్యేక తనిఖీలు



ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద రైలులో తనిఖీలు చేస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోకి గంజాయి, మత్తుపదార్థాలు రవాణా కాకుండా అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిఘా ఏర్పాటు చేశామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఈగల్ ఐజీ రవికృష్ణ ఆదేశాల మేరకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో ఏలూరులో పోలీస్, రైల్వే పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చే ప్రతి రైలులో తనిఖీలు చేశారు. అనుమానస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు రవాణా అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే 1972కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



1కే వాక్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): కక్షిదారుల మధ్య సామరస్య వాతావరణంలో కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు పరిష్కరించడమే మధ్యవర్తిత్వ లక్షణం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం అంశంపై వారం రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ తదితర ప్రాంతాలలో 1కే వాక్ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం చేసేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 80 మంది న్యాయవాదులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, సోషల్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ఈ కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండో అదనపు జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని, 7వ అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులి కృష్ణ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.కృష్ణ సాయి తేజ, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ రెవెన్యూ అధికారిగా బాధ్యతల స్వీకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని ఏలూరు డివిజన్ విద్యుత్ అసిస్టెంట్ రెవెన్యూ అధికారిగా టీ.వెంకాయమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం డివిజన్‌లో జూనియర్ అకౌంట్స్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకాయమ్మకు ఇటీవల సంస్థ సీఎండీ ఏఏఓగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్



దారితప్పుతున్న కూటమి పాలన పుస్తకాన్ని ఆవిష్కరించిన సీపీఎం కార్యదర్శి గోపాలన్

తణుకు అర్బన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. తణుకు సీపీఎం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ బిడ్డ నిధి, ఉచిత బస్సు హామీల అమలుకోసం మహిళలు వేచిచూస్తున్నారని అన్నారు. విద్యుత్ బిల్లులు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పి నేడు రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ఇంధన సర్దుబాటు చార్జీలుగా వేయడం దుర్మార్గమని అన్నారు. మరో రూ.842 కోట్ల విద్యుత్ భారాన్ని బిల్లుల్లో కలిపేందుకు ప్రతిపాదన చేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టమని అప్పట్లో మంత్రి లోకేష్ అన్నారని నేడు యథేచ్ఛగా బిగిస్తున్నారని అన్నారు. నేటికీ ధాన్యం బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు అల్లాడుతున్నారని స్పష్టం చేశారు. తమ సైకిల్ యాత్రలో ప్రజలు ఈ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో జిల్లా విస్తృతస్థాయి సమావేశాలు తణుకులో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై 'దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన' పుస్తకాలను ఆవిష్కరించారు.



● శాకంబరిగా బలుసులమ్మ

ఆషాఢ మాసం సందర్భంగా తాడేపల్లిగూడెం ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని శుక్రవారం శాకంబరి దేవిగా విశేషంగా అలంకరించారు. అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణంలో పది టన్నుల పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పుష్పాలు, ఆకులతో అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు శ్రీరంగం అంజి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

– తాడేపల్లిగూడెం(టీఓసీ)



ముంచెత్తుతున్న వరద

- పోలవరం నుంచి 6.35 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- ఏజెన్సీలో నీటమునిగిన ఎద్దులవాగు వంతెన
- 18 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మరో మూడు రోజులు ఉధృతి కొనసాగే అవకాశం
- ఏజెన్సీలో అప్రమత్తం



పోలవరం ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు



వేలేరుపాడు మండలంలో వరద నీటిలో మునిగిన ఎద్దులవాగు వంతెన



ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాములనాయక్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరికి వరద సీజన్ వచ్చేసింది. శుక్రవారం ఒకేరోజు 6.35 లక్షల క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుంచి పోలవరానికి పోటెత్తింది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో అప్రమత్తమయ్యారు. ఎద్దులవాగు వంతెన పైకి నీరు చేరి శుక్రవారం అర్ధరాత్రికి నీటమునిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో 18 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోనున్నాయి. మరో మూడు రోజులు పాటు వరద ఉధృతి తీవ్రంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గోదావరికి ఉపనది శబరి వరద నీటితో పోటెత్తుతోంది. గత వారం రోజులుగా రోజూ సగటున 2 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం మీదుగా సముద్రంలో వరద నీరు కలుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆకస్మాత్తుగా వరద తీవ్రత రెట్టించింది. ఏటా జూలై, ఆగస్టు నెలలో గోదావరికి వరదలు పోటెత్తడంతో ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని లంక గ్రామాలున్న యలమంచిలి, ఆచంట మండలాల్లో వరద తీవ్రత ఉంటుంది. ప్రధానంగా ముంపు మండలాల్లో రాకపోకలు నిలిచిపోయి.. వందలాది ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. ఈ పరిణామాల మధ్య ఈ ఏడాది కూడా గోదావరి వరద తీవ్రత శుక్రవారం ఆకస్మాత్తుగా పెరగడంతో ఏజెన్సీ మండలాల్లో హై అలర్ట్ ప్రకటించారుఉ. రాత్రి 7 గంటల సమయానికి భద్రాచలం వద్ద 37.60 అడుగులకు నీటిమట్టం చేరింది. 6,98,510 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాత్రి 8 గంటల సమయానికి పోలవరం నుంచి దిగువకు 6,35,634 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద తీవ్రత శనివారం మధ్యాహ్నానికి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉందని, 7.50 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేసే స్థాయిలో ఇన్‌ఫ్లో ఉందని అధికారుల అంచనా. మహారాష్ట్ర, తెలంగాణాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో వరద తీవ్రత మొదలైంది.


జలదిగ్బంధంలో ఎద్దులవాగు వంతెన

వేలేరుపాడు-కొయిదా మార్గంలోని ఎద్దులవాగు వంతెన జలదిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం రాత్రికి పూర్తిగా నీటమునిగింది. దీంతో 18 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండల కేంద్రానికి జిల్లా కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. కుక్కునూరు- దాచారం రహదారిలో గుండేటివాగు ఉధృతంగా ప్రవహించి వంతెన నీటమునిగింది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే కుక్కునూరు మండలంలో దాచారం, గొమ్ముగూడెం పంచాయితీ నలువైపులా నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. గొమ్ముగూడేనికి చెందిన 15 కుటుంబాలను పునరావాస కాలనీలకు తరలించారు.

ముంపు ప్రాంతాల్లో ఐటీడీఏ పీవో పర్యటన

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో శుక్రవారం ఐటీడీఏ పీవో రాములనాయక్ పర్యటించారు. కుక్కునూరు మండలంలో వరద ప్రభావిత గ్రామాలైన లచ్చిగూడెం, గొమ్ముగూడెంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలిరావాలని గ్రామస్తులకు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 30.110 మీటర్లకు చేరింది. స్పిల్ వే 48 గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్దకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రదర్శనగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

భీమవరం: మున్సిపల్ పర్మినెంట్, అప్కాస్ ఔట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలని లేకుంటే ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు హెచ్చరించారు. కార్మికుల హక్కుల సాధనకు చేపట్టిన దశల వారీ ఆందోళనల్లో భాగంగా శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌ను ముట్టడించి, ధర్నా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, రంగారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మునిసిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని లేకుంటే సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లకు అందచేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి లేజర్ రన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


నాగసత్య గణేష్

తణుకు అర్బన్: స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి లేజర్ రన్ (రన్నింగ్ –షూటింగ్)పోటీల్లో తణుకు మండలం మండపాక గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. నాగ సత్య గణేష్ అండర్ 17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. గణేష్ ఈ నెల 12, 13 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి లేజర్ రన్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి గణేష్‌తో పాటు శిక్షణనిచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను పలువురు అభినందించారు.

చేబ్రోలు సర్పంచ్‌కు అరుదైన గుర్తింపు


రందే లక్ష్మీసునీత

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు సర్పంచ్ రందే లక్ష్మీసునీతకు అరుదైన గుర్తింపు లభించింది. జాతీయస్థాయిలో నిర్వహించే సర్పంచ్ సంవాద్‌లో ప్రథమ స్థానం లభించింది. మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సర్పంచ్ సంవాద్ అనే వేదికను ఏర్పాటు చేశారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా ప్రతి నెలా దేశంలో ఉండే సర్పంచ్‌లు గ్రామాలు ఎలా అభివృద్ధి చేస్తున్నారు? ఇంకా ఎలా చేయాలి? అనే అంశాలపై వారి అభిప్రాయాలను పంచుకుంటూ ఉంటారు. అయితే చేబ్రోలు సర్పంచ్ సునీత వర్మీ కంపోస్టు తయారు చేయడం, పరిశుభ్రత విషయం, తడిచెత్త పొడిచెత్త విడదీయటం, మంచినీటి వనరులు కాపాడుకునే విషయంపై 80 సెకన్లు నిడివితో ఉన్న వీడియో పంపారు. ఈ నేపథ్యంలో ఆమె జూన్ నెలకు సంబంధించి ప్రథమ స్థానంలో నిలిచారు. లక్ష్మీసునీతకు ప్రోత్సాహకంగా రూ.35 వేలు అందిస్తారు. ఈ సందర్భంగా లక్ష్మీ సునీత శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అవార్డు రావడం తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

గోదావరికి పంచ హారతుల సమర్పణ



పెనుగొండ: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా వశిష్టా గోదావరికి శుక్రవారం సిద్ధాంతంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు ఇచ్చారు. పూజా కార్యక్రమాలు అనంతరం కలగ భద్రుడు బ్రహ్మత్వంలో గోదావరి హారతులునిచ్చారు. కార్యక్రమంలో హిందూ ధర్మపరిరక్షణ సభ్యులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

దెందులూరు: మండలంలోని మేదినరావుపాలెం గ్రామానికి చెందిన గారపాటి నాగేంద్ర అదృశ్యమయ్యాడంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నాగేంద్ర గురువారం కుటుంబ సభ్యులపై అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అయితే శుక్రవారం పోలవరం కాలులో అతని సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయంటూ కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.


కొత్తబస్టాండ్ కాల్వగట్టు రోడ్డు దుస్థితి ఇది


తూర్పులాకుల వద్ద రోడ్డుపై ఏర్పడిన బారీ గొయ్యి

గోతుల యాతన తీరేదెన్నడు?


వన్‌టౌన్ పెద్ద వంతెన సెంటరులో ఏర్పడిన పెద్ద గొయ్యి

ఏలూరు నగరంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. రోజూ ఏదో గోతిలో పడి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. వర్షం పడితే ఈ గోతుల్లో నీరు చేరి ఏది గొయ్యో, ఏది గొప్పో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిచాలి, గోతులు పూడ్చించాలని వాహనచోదకులు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


ఛిద్రమైన ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ రోడ్డు

బీజీబీఎస్ పాలకవర్గ ఆగడాలపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు

నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, పాలకవర్గంపై ఆగడాలపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న నలుగురు మహిళా అధ్యాపకులు గత 15 రోజులుగా కళాశాల వద్ద ఆందోళన చేస్తున్నసంగతి తెలిసిందే. తమను అకారణంగా విధులు నుంచి తొలగించి పాలకవర్గం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం అధ్యాపకులకు మద్దతుగా నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు మాట్లాడుతూ కళాశాల ఆస్తులు అమ్మకానికి పెట్టడం, మహిళా అధ్యాపకులపై లైగింక వేధింపులకు పాల్పడం దారుణమన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం ఏంటి అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, సీపీఎం నేత కవురు పెద్దిరాజు, కోట్ల రామ్‌కుమార్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి తీరు దారుణం


డిగ్రీ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రోజుకో మాట పూటకో విధానంలా ఉన్నత విద్యామండలి తీరు ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. శుక్రవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చి తిరిగి రివ్యూ చేసి సింగిల్ మేజర్ విధానం కొనసాగిస్తామని పేర్కొనడం హాస్యస్పదమన్నారు. రాష్ట్రంలో ఉన్న స్టేక్ హోల్డర్స్‌తో సంప్రదించకుండా ఇష్టానుసారంగా నెలకో నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని దుయ్యబట్టారు. గత నిర్ణయానికి అనుగుణంగా డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.అదే విధంగా ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి, మైనర్ సబ్జెక్టులకు క్రెడిట్ పాయింట్స్ పెంచాలని కోరారు. విద్యార్థి చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్ చేస్తున్న సందర్భంలో విద్యార్థులకు తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలవడి మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానస మృతదేహానికి అంత్యక్రియలు

భీమడోలు : మండలంలోని పోలసానిపల్లి గురుకుల పాఠశాలలో ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ విద్యార్థిని లేళ్ల మానస మృతదేహానికి శుక్రవారం పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు. గురువారం పీటీఎం సమావేశం అనంతరం గురుకుల పాఠశాలలో మానస ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. అయితే తమ కుమార్తె మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ తల్లిదండ్రులు, బంధువులు నిరసన తెలుపుతూ పోస్టుమార్టానికి అంగీకరించలేదు. మానస మృతి అనుమానాస్పదంగా ఉందని గురుకుల పాఠశాల అధ్యాపకులు, సిబ్బందిపై కేసు నమోదు చేయాలని గురువారం రాత్రి నుంచి తెల్లవార్లూ ఆందోళనకు దిగారు శుక్రవారం ఉదయం ఏలూరు ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రవణ్ కుమార్, భీమడోలు సీఐ విల్సన్ మానస తల్లిదండ్రులను, కళాశాల సిబ్బందిని విచారించారు. వారి వద్ద నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్స్‌ను రికార్డు చేశారు. అయితే పీటీఎం సమావేశానికి తన తమ్ముడిని ఎందుకు తీసుకురాలేదు? అని తమను ప్రశ్నించిన మానస క్షణికావేశంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని మానస తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చి మానస మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. మానస మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన భీమడోలు మండలం అర్జావారిగూడెం తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఎల్అండ్‌టీ రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న సంఘటనలో దూపాటి ఇజ్రాయిల్ (17) అనే యువకుడు మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఇజ్రాయిల్ పాలకొల్లు నుంచి ఎల్అండ్‌టీ వైపు వెళ్తుండగా పాలకొల్లు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇజ్రాయిల్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు. అప్పటికే ఇజ్రాయిల్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఇజ్రాయిల్ సోదరుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జీజే ప్రసాద్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

డ్రోన్ల వినియోగంపై రైతులకు శిక్షణ


డ్రోన్ల ద్వారా ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: వ్యవసాయ రంగంలో యాంత్రికరణ వేగంగా వృద్ధి చెందుతుంది. ఇటీవల డ్రోన్ల ద్వారా పంట చేలకు ఎరువులను వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ, ఆత్మ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (దిశ) కార్యక్రమం ద్వారా జిల్లాలో రైతులకు, ఎరువుల వర్తకులకు శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పంటల యాజమాన్య పద్ధతులు, డ్రోన్ల వినియోగం, ఎరువులను సకాలంలో వాడకం గురించి శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా పంట పెట్టుబడి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ హబీబ్ భాష వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు.

ప్రతిభ చూపుతున్న అభ్యర్థులు

దిశ శిక్షణ భాగంగా 2023– 24 సంవత్సరానికి గ్రూపులకు సంబంధించిన కొన్ని రోజులు వనరులు సమకూర్చి వ్యాపారస్తులకు కంపెనీ క్షేత్ర పరిశీలకులకు శిక్షణ అందిస్తున్నారు. వారిలో తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత అయిన వారికి డైరెక్టర్ ఆత్మ ద్వారా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారు. గ్రూపులకు సంబంధించి పరీక్షకు హాజరైన వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ముగ్గురు డిస్టింక్షన్‌లో నిలిచారు. రైతులు, వ్యాపారులు శాస్త్రీయ పరిజ్ఞానంతో పాటు వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక శిక్షణ



దిశ శిక్షణలో ఒక బ్యాచ్‌కి 48 క్లాసులు ఉంటాయి. 40 థియరీ క్లాసులు, 8 ఫీల్డ్ విజిట్స్ ఉంటాయి. కాబట్టి ప్రతి బ్యాచ్‌కు ఒక ఫెసిలిటేటర్‌ను కేటాయించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– హబీబ్ బాషా, జాయింట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ

పాఠశాల విలీనంపై మిన్నంటిన నిరసన

సర్పంచ్ ప్రియాంక నిరహార దీక్షను అడ్డుకున్న పోలీసులు


పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద నేలపై బైఠాయించిన సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, నాయకులు, విద్యార్థులు


తహసీల్దార్‌తో చర్చిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు

పెనుమంట్ర: పెనుమంట్ర దళితవాడలోని ఎలిమెంటరీ పాఠశాలను దూరంగా ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ప్రసన్న కుమార్ దంపతులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా దీక్ష చేయడానికి ఏర్పాటు చేసుకున్న శిబిరాన్ని అనుమతులు లేవంటూ ఉదయమే పోలీసులు తొలగించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రియాంక దంపతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నేలపైనే బైఠాయించారు. వీరికి మద్దుతుగా విద్యార్థులు తల్లిదండ్రులు కూడా నేలపైనే బైఠాయించి అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మండల విద్యాశాఖ అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన విషయాన్ని తెలుసుకున్న ఆచంట నియోజకవర్గంలోని పెనుమంట్ర, పోడూరు జెడ్పీటీసీ సభ్యులు కర్రి గౌరీ సుభాషిని, గుంటూరు పెద్దిరాజులతో పాటు పలువురు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సర్పంచ్ ప్రియాంకకు మద్దతుగా నిలిచారు. తహసీల్దార్ వై.రవికుమార్, ఎస్సై స్వామి నాయకులతో గంటకు పైగా చర్చించిన అనంతరం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి కొద్ది రోజుల్లోనే న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో సర్పంచ్ ప్రియాంకతో పాటు తల్లిదండ్రులు నిరసన విరమించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వాసంశెట్టి కిరణ్, ఈది అనిత ప్రవీణ్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు తమనంపూడి వీరైడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ గూడూరు దేవేంద్రుడు, నాయకులు కొవ్వూరి వేణుమాధవ్ రెడ్డి, కర్రి రామలింగేశ్వరరెడ్డి, సత్తి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాత చనిపోయాడని ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్

పాలకోడేరు: ఆస్తి కోసం బతికున్న తాతను చిత్రహింసలు పెట్టి, ఆపై తాత చనిపోయాడంటూ అతని ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న మనవడి ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేంద్ర గ్రామానికి చెందిన కుక్కల గణేశ్వరరావు అనే వృద్ధుడికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కొంతకాలానికి భార్య, కొడుకు చనిపోయారు. అప్పటి నుంచి తన మనవడు మధు గణేష్, కోడలు సూర్య కుమారి కుటుంబంతో ఉంటున్నాడు. అనంతరం తనకున్న కొద్దిపాటి పొలాన్ని మనువడికి రాసి ఇచ్చారు. ఇంకా కొంత స్థలం, ఇతర ఆస్తులు తనకు ఇవ్వాలంటూ మధు గణేష్ తాతను చిత్రహింసలు పెడుతున్నాడు. అందుకు ఆ వృద్ధుడు అంగీకరించకపోవడంతో గునుపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తాత చనిపోయినట్లు డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వృద్ధుడు గణేశ్వరావు శుక్రవారం పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సై రవివర్మ కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

పాలకోడేరు: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరిని పాలకోడేరు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మండలంలోని కుముదవల్లిలో భీమవరం చినరంగనిపాలేనికి చెందిన తుమ్మ ప్రేమ్ చందు, భీమవరానికి మారుబోయిన మావుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మోగల్లు, కోరుకొల్లు, విస్సాకోడేరు గ్రామాల్లో ద్విచక్ర వాహనాల చోరీ కేసులో వీరి ప్రమేయం ఉందని నిర్ధారించుకున్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భీమవరం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్సై రవివర్మ తెలిపారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యంపై భర్త ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. నాగలక్ష్మి, రాటాలుకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి నుంచి నాగలక్ష్మి కనిపించకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు.

ఆలయ మరమ్మతులకు అంచనాలు


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో కొన్ని నిర్మాణాలు, మరమ్మతులు కోసం అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాసరావు శుక్రవారం ఆలయానికి విచ్చేసి, పరిసరాలకు పరిశీలించారు. 2027 గోదావరి పుష్కరాలకు మరమ్మతులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆలయంలో స్వామివారి చుట్టూ ఉన్న ప్రాకార మండపం లోపలి భాగంలో బేడా మండపం లీకేజీలు అవుతున్నాయి. అలాగే పార్వతి దేవి, లక్ష్మీదేవి గర్భాలయాల్లో కూడా వర్షం నీరు కారిపోతుంది. జనార్దన స్వామి ఆలయం గర్భగుడిలో టైల్స్ ముక్కలుగా ఊడి పడిపోతున్నాయి. జనార్దనస్వామి ఉపాలయం పక్కన ఉన్న బేడా మండపానికి సంబంధించి సుమారు మూడు స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగిపోయి ఉన్నాయి. ముఖ్యంగా 120 అడుగుల ఎత్తయిన గాలి గోపురం లోపల శిథిలావస్థకు చేరుకుంటుంది. ఆయా సమస్యలను శ్రీనివాసరావు పరిశీలించారు.

కార్యాలయ నిర్మాణంపై తర్జనభర్జన

ప్రస్తుతం ఆలయ కార్యాలయం ఉన్న ప్రాంతంలో మరో మండపం నిర్మాణానికి అంచనాలు తయారు చేస్తున్నారు. ఆలయానికి నైరుతి మూలలో గత కొంత కాలం క్రితం ఖాళీ చేసిన ఎస్‌పీఆర్ఆర్ క్లబ్ స్థలం ఆలయానికి చెందినదే కావడంతో అప్పట్లో ఆ స్థలం ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో కార్యాలయం నిర్మాణం చేయడమా లేఖ అన్నదాన భవనంగా ఉంచడమా? అనే దానిపై చర్చలు సాగుతున్నాయి. కార్యక్రమంలో దేవదాయ శాఖ భీమవరం అధికారి సూర్యప్రకాశరావు, వర్దినీడి వెంకటేశ్వరరావు, ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రసాదం తీసుకోని డీఈ

ఆలయం ప్రాకారం బేడా మండపంలో లీకేజీలను తనిఖీ చేస్తూ అంచనాలు వేస్తున్న సమయంలో పక్కన ఉన్న కనకదుర్గమ్మ వారికి తయారు చేసిన దద్ధోజనం ప్రసాదాన్ని అక్కడ పురోహితులు పంచి పెడుతున్నారు. అటుగా వస్తున్న డీఈతో పాటు మిగిలిన అధికారులను సైతం అయ్యా ప్రసాదం ఇదిగోండని పెట్టగా చేతులు బాగోలేదు వద్దులేండి అని వెళ్లిపోవడంతో భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది.

అదుపు తప్పితే అంతే



పొట్టకూటి కోసం కొందరు కూలీలు ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. వాహనాల పైన, వెనుక కూర్చుని ప్రయాణిస్తున్నారు. అదుపు తప్పితే ఎంతటి ప్రమాదానికి గురి కావాల్సి వస్తుందనే కనీస విషయాన్ని పట్టించుకోవడం లేదు. నిత్యం రహదారులపై ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు సాగించే వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. శుక్రవారం ద్వారకాతిరుమల వైపు నుంచి భీమడోలు వైపుగా వెళుతున్న ఒక లోడు లారీపై కూలీలు ఇలా ప్రయాణిస్తూ కనిపించారు.

– ద్వారకాతిరుమల

క్లుప్తంగా

వీరరాఘవులు కృషి అభినందనీయం



చినతాడేపల్లి గ్రామంలో వీరరాఘవులు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పరిశ్రమ అభివృద్ధికి వీరరాఘవులు చేసిన కృషి అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చినతాడేపల్లి పాల డెయిరీలో గత 50 ఏళ్లుగా చైర్మన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన బొప్పిడి వీరరాఘవులు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పరిమి రవికుమార్ మాట్లాడారు. సన్మానగ్రహీత వీరరాఘవులు మాట్లాడుతూ తనకు 50 ఏళ్లుగా పాడి పరిశ్రమ అభివృద్ధి చేసేందుకు సహకరించిన రైతులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ చిటకన శ్రీను, రైతులు పరిమి వెంకటేశ్వరరావు, గన్నమని అనిల్‌కుమార్, అలపాటి సత్యనారాయణ, చిటికెన నాగసురేష్, బొప్పిడి అబ్బులు, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



పరిమెళ్ల బాలుర వసతిగృహాన్ని సందర్శించిన కలెక్టర్ నాగరాణి

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల బాలుర వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వారినుంచి అడిగి తెలుసుకొన్నారు. పదోతరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నతంగా చదివి ఉత్తమఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం వసతిగృహ విద్యార్థుల కోసం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాతలు కూడా సహకరించి విద్యాభ్యున్నతికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారులు రాజు, రామకృష్ణ, హౌసింగ్ పీడీ పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కామన మునిస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గీత కార్మికుల సమస్యలను కలెక్టర్‌కి చెప్పుకుందామని, తరలిరావాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో కల్లుగీత సహకార సొసైటీ అధ్యక్షుడు దాసరి సూరిబాబు అధ్యక్షతన సంఘ సమావేశం శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలను పరిష్కరించలేదని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ద్వారా లిక్కర్‌ను అమ్ముతున్నారని, దీంతో గీత కార్మికులకు అమ్మకాలు లేక పస్తులతో కాలం గడుపుతున్నారన్నారు. తాటి, ఈత చెట్లుపై నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించిన వికలాంగులైన వారికి ప్రభుత్వం ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారని, దీని వల్ల కల్లు ఉత్పత్తిలో ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 14వ తేదీన సోమవారం జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు గీత కార్మికులు సమస్యలు కలెక్టర్‌కు చెప్పడానికి పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి సాంబమూర్తి, దాసరి నరసింహమూర్తి, గుబ్బల నాగభూషణం, పెనుమర్తి శ్రీను, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న గ్లోబల్ సపోర్టు సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ ఫౌండర్ త్రికళ, ట్రస్టీ జనార్దనరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని పేద విద్యార్థినికి ఫీజులు నిమిత్తం రూ. 22 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. దాత రాజా గాయత్రి సహకరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతుచిక్కని 'అన్నదాత సుఖీభవ'

- అన్నదాతకు వంచనేనా..?
- రెండో ఏడాది నడుస్తున్నా అందని సుఖీభవ
- పెట్టుబడి సాయం లేదంటున్న రైతులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది అందిన వైనం



ఆరవల్లిలో రైతు సేవా కేంద్రం

తణుకు అర్బన్: ఎన్నికల హామీలో భాగంగా కూటమి నేతలు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో రైతాంగం తీవ్రంగా విమర్శిస్తున్నారు. పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుందని ఎదురుచూపులు చూస్తున్న రైతాంగానికి గత ఏడాది కాలంలో నిరాశే మిగిలింది. రబీ పూర్తై ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో రైతాంగం నిమఘ్నమైనప్పటికీ ఇంతవరకు పథకం తాలూకా డబ్బులు పడకపోవడంతో రైతాంగం కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని తూర్పారపెడుతున్నారు. గతేడాది, ఈ ఏడాది కలిపి మొత్తం రూ. 40 వేలు అన్నదాత సుఖీభవ నిధుల కోసం రైతాంగం వేచిచూస్తున్నారు.

ఏడాది గడిపేశారు..

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నేతలు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు ఏడాదికి రూ.20వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ గతనెల 12వ తేదీకి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఆ ఏడాది రైతులకు మొండిచెయ్యి చూపించగా రెండో ఏడాదిలో సైతం ఇంతవరకు డబ్బులు వేయని దుస్థితితో రైతులు మండిపడుతున్నారు. పెట్టుబడి సాయంగా ఉపయోగపడే పథకం నిధులు అందుబాటులోకి రాకపోగా ఇంకా రబీలో తూచిన ధాన్యం తాలూకా డబ్బులు కూడా జమ కాకపోవడంతో రైతాంగం అప్పులపాలైపోతున్నామని వాపోతున్నారు.

గత జగన్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా రూ. 116.08 కోట్లు..

గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా ను రైతాంగానికి పెట్టుబడి రూపంలో ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించి ఏ ఒక్క రైతు కూడా అనర్హుడుకాకుండా ఉండేలా పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నారు. ఏడాదికి రూ. 15వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో ముందుగా చెప్పిన తేది ప్రకారం జమచేసేవారు. రైతులు పంటసాగుకు అప్పులు చేసే పరిస్థితి లేకుండా ఆ డబ్బులను సద్వినియోగం చేసుకునేవారు. అయితే కూటమి నేతలు ఎన్నికల ముందు ఆ పథకానికి అన్నదాత సుఖీభవ పేరుగా మార్చి రూ. 20వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో 40242 మంది రైతులకు రూ.116.08 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమచేశారు. దీంతో రైతులు ప్రతి ఏడాది డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమకాగానే హర్షం వ్యక్తం చేసే పరిస్థితి ఉండేది. కానీ నేడు రైతాంగాన్ని కూడా పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

"

ఇంకా ఇవ్వలేదు



అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రూ. 20వేలు ఏడాదికి ఇస్తామని కూటమినేతలు హామీ ఇచ్చారు. కానీ ఏడాది పూర్తయిపోయినా డబ్బులు వేయలేదు. రైతాంగాన్ని ఆదుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం దారుణం. ఒక ఏడాది డబ్బులు ఇవ్వలేకపోయారు కనీసం రెండో ఏడాదైనా డబ్బులు వేస్తే రైతులకు పెట్టుబడి సాయం రూపంలో ఆసరాగా ఉంటుంది.

– కోరుకొల్లు వెంకట్రావు, రైతు, కంచుమర్రు

స్పర్శ లేని మచ్చలు.. కుష్టు వ్యాధికి సంకేతం



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: శరీరంపై స్పర్శ లేని మచ్చలు కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలని డీపీఎంవో వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే సకాలంలో వైద్యం పొందాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత క్రమం తప్పకుండా మందులు వాడితే కుష్టు వ్యాధిని తొలి దశలోనే అంగవైకల్యం రాకుండా చూడవచ్చన్నారు. వ్యాధి సోకిన వారిని సమాజంలో ఒకరిగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, ఎంపీహెచ్‌ఈవో కిషోర్, పీహెచ్‌ఎన్ అన్నమ్మ, హెచ్‌వీ హనీ మెర్సి, హెచ్‌ఎస్ లక్ష్మణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్ని నమ్మించి మోసం చేసిన కూటమి



మండపాకలో క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న జానకి

తణుకు అర్బన్: ప్రజలకు అందిస్తానన్న సూపర్ సిక్స్ తదితర హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలన అందిస్తుందని వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి అన్నారు. తణుకు మండలం మండపాక గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ ఉన్న కరపత్రాలను పార్టీ శ్రేణులు గడపగడపకూ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోసం, వంచనకు కూటమి ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ప్రజల్ని మోసం చేసి వెన్నుపోటు పొడవం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, ప్రస్తుత కూటమి హయాంలో సంక్షేమాన్ని ఎగ్గొట్టి చోద్యం చూస్తున్న విధానాన్ని ప్రజానీకం గమనిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏవిధంగా మోసపోయారనే విషయాన్ని పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా క్యూఆర్ కోడ్ ఉన్న కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గడపలోను ప్రజలు తమను సాదరంగా స్వాగతిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి సురేష్, జువ్వల వెంకటరాజు, సరెళ్ల క్రాంతి, ఉండవల్లి సుందరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



తణుకులో డీవీవీఎస్ వర్మను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రకృతి, సామాజిక పరంగా సంఘర్షణ లేని సమాజాన్ని సాధించడానికి కృషి చేయాలని సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ పిలుపునిచ్చారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమాజం స్వచ్ఛందసేవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో రోటరీ క్లబ్ మన దేశం నుంచి పోలియో వ్యాధిని పారద్రోలేందుకు విశేషమైన కృషి చేసిందని, లయన్స్ క్లబ్ ప్రజల కంటి ఆరోగ్యం కాపాడేందుకు విశేషమైన కృషి చేసిందని, మానవత సంస్థ వివిధ రకాలుగా మానవతా సేవలు చేస్తోందని కొనియాడారు. అంతరాలు, వివక్షలేని సమాజ కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని కోరారు. అనంతరం వర్మను రోటరీ, లయన్స్ క్లబ్ నాయకులతోపాటు మానవత సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జి.సుధాకర్ డా.వి.వెంకటరాజు, బెల్లంకొండ బుచ్చిబాబు, మల్లిన అరుణ సారధి, నందిగం సుధాకర్ , కోడూరి ఆంజనేయులు, బసవా రామకృష్ణ, వావిలాల సరళాదేవి, కోడూరి రాధా పుష్పవతి , కరుణాకర చౌదరి , కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, పీవీ ప్రతాప్, పి దక్షిణామూర్తి పేరూరు మురళీకుమార్, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ సంక్షేమ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీడీఎస్ నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలో రెడ్ల అభ్యున్నతి కోసం ఏర్పడిన రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) ద్వారా సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ సంఘ రీజినల్ కో ఆర్డినేటర్ సీహెచ్‌వీవీఎస్ రెడ్డి (రెడ్డిబాబు) పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పెంటపాడులో ఆర్‌సీడీఎస్ సంఘ సమావేశం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి బాబు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ ఆశయాలు పుణికి పుచ్చుకొనేలా రెడ్డి సంఘాన్ని ఒక తాటిపైకి తెచ్చి వారి అభ్యున్నతితో పాటు, ఇతర కమ్యూనిటీల్లో ఉన్న పేదలను గుర్తించి వారి కోసం ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర మహిళా కో ఆర్డినేటర్ పద్మప్రియారెడ్డిల సూచనల మేరకు వారి సమక్షంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఆర్‌సీడీఎస్ సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ జయంతి పురస్కరించుకొని పలు ప్రాంతాలలో ఇప్పటికే పేదలకు అన్న వస్త్ర దానాలతో పాటు, విద్యార్థులకు విద్యాసామగ్రిని, వీరంపాలెం ,పెంటపాడు, ముదునూరుపాడు ప్రాంతాలలో పంపిణీ చేశామన్నారు. ఆర్‌సీడీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ రాబోయే రోజులలో ఈ సంఘం ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలలు నిర్వహిస్తామన్నారు. ంంఘ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, జిల్లా సలహాదారు వెలగల లింగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం



తణుకు కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీతేజ

తణుకు అర్బన్: సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడకు చెందిన డాన్ బాస్కో నవజీవన బాల భవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీ తేజ అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన డిజిటల్ పౌరులుగా ఉండేందుకు, సైబర్ నేరాలపై వివిధ రకాల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న ప్రస్తుత కాలంలో వాటి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ కేటుగాళ్లు లక్కీ డ్రా, ఉచిత రీఛార్జ్, గిఫ్ట్ కూపన్లు వంటి తదితర ఉచిత డబ్బును పొందే మార్గాలను ఆశ చూపి, మన బ్యాంకులో డబ్బును కొల్ల గొడుతున్నారన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి, నేరం జరిగిన గంటలోపే 1930 నెంబర్‌కు కాల్ చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు జరుగుతున్న తీరును స్క్రీన్‌పై ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఫుడ్ కమిటీ చైర్మన్



తణుకులో పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిటీ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి



పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప రెడ్డి శుక్రవారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఫ్లోరిఫైడ్ రైస్‌లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, కోడి గ్రుడ్డు కూడా అత్యంత పోషకాహారమని విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న భోజనాన్ని తినాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు జె.కృష్ణకిరణ్, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ అడ్వైజర్ డాక్టర్ కరణం బాలస్వామి, డీవైఈవో మురళీ సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెం మండలంలో ఆహార కమిషన్ చైర్మన్ పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల హాస్టల్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్. విజయ్‌ప్రతాపరెడ్డి, సభ్యుడు జె.కృష్ణ కిరణ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గురుకుల రికార్డులను పరిశీలించి, అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా, తాడేపల్లిగూడెం పట్టణంలోని 17వ వార్డు మున్సిపల్ స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వారి వెంట డీఎస్‌వో సరోజ, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీడీపీవో టీఎల్.సరస్వతి, సూపర్‌వైజర్లు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి నిధుల సేకరణలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర ప్రజా పోరాటాలు సాగిస్తూ సీపీఐ మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన పశ్చిమ గోదావరి జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో స్వంత గూడు లేని పేదలకు గూడు నిర్మించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మందికి పైగా పేదలతో సీపీఐ ఇళ్ల స్థలాల దరఖాస్తులు పెట్టించడం జరిగిందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తదితరులు ఉన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న మాట్లాడుతున్న జడ్జి షేక్ సికిందర్ భాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా నాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో కోర్టు భవనాల సముదాయం ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మధ్యవర్తిత్వం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ర్యాలీ నిర్వహించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు పరిష్కారం చేసుకోవాలని, కేసులు పరిష్కారంతో డబ్బు, సమయం, వృథా కాకుండా ఉంటుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్‌శ్రీ, మొదటి అడిషనల్ సివిల్ జడ్జి కె.లలితాదేవిలు మధ్యవర్తిత్వంలో అవగాహన చేశారు. మధ్యవర్తులు, కక్షిదారులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శిరిగినీడి విజయకృష్ణ, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం పరిశీలించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు మరో నెల రోజుల వ్యవధిలో తాడేపల్లిగూడెంలో హాల్ట్ వస్తుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే బి.శ్రీనివాస్, బీజేపీ నేతలు శ్రీదేవి, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలు చేసిన చరిత్ర ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సొంతం



యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక హక్కులకై త్యాగాలు, పోరాటాలు చేసిన చరిత్ర ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సొంతమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పేర్కొన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. డిపో కమిటీ అధ్యక్షుడు చోడగిరి వెంకటరమణ తొలుత యూనియన్ జెండాను ఎగరవేశారు. అమరజీవి కపర్దీ విగ్రహానికి ఆర్టీసీ సీనియర్ ఉద్యోగి డీఎస్ఎన్ రెడ్డి పూలమాల వేశారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ ప్రైవేట్ బస్సు రూట్లను, బస్సులను జాతీయం చేసి, ఏపీఎస్ ఆర్టీసీ వంటి ప్రభుత్వరంగ రవాణా వ్యవస్థ ఏర్పాటుకు బీజం వేసిన పోరాటం తాడేపల్లిగూడెం నుంచి ప్రారంభమైందని తెలిపారు. ఒకప్పుడు యజమానుల వెట్టి చాకిరీలో నలిగిపోతున్న ప్రైవేట్ బస్సు కార్మికులను విముక్తి చేసి, ఆర్టీసీ ఏర్పాటు ద్వారా కార్మికులకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించిన ఘనత అలనాటి ఏఐటీయూసీ నాయకత్వానిదే అన్నారు. నాయకులు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని, 12 గంటల షిప్ట్ విధానాన్నీ ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తు పోరాడాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. డిపో నాయకులు సీహెచ్ వెంకట రమణ, డిపో సెక్రటరీ కె.శ్రీనివాస్, యూనియన్ నాయకులు ఆర్ ఎల్ కుమారి, బి.నరసింహులు, కె.శ్రీను, సలేషా, మనోహర్, వీరన్న, శివ, భాషా, సువర్ణరాజు, మురళీ నాయకత్వం వహించారు. కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఫొటో, వీడియోగ్రాఫర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్: కెమెరాల్లో వస్తున్న సాంకేతికతను సీనియర్లు అందిపుచ్చుకోవాలని, తద్వారా భవిష్యత్‌లో మనుగడ సాధ్యమని ఫుజి ఫిల్మ్ ప్రతినిధి తిరు అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని ఒక రెసిడెన్సీలో కెమెరా, వీడియో గ్రాఫర్లకు కెమెరా సాంకేతికతలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరు మాట్లాడుతూ పాత కెమెరాలతో పోలిస్తే కొత్త కెమెరాల్లో ఎంతో అద్భుతమైన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సీనియర్ కెమెరామెన్లు సైతం నైపుణ్యం సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఫొటో, వీడియో కెమెరాల్లో మరిన్ని ఫీచర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణా, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల హెడ్ రూపేష్, టెక్నికల్ ఎవెంజర్స్ విజయరెడ్డి, తాడేపల్లిగూడెం ఫొటో, వీడియోగ్రాఫర్లు అసోసియేషన్ చైర్మన్ ఎం.రాము, అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, అయితం ప్రసాద్, కోశాధికారి మండా పవన్, ఉపాధ్యక్షుడు మురళీ, భానుప్రసాద్, సంయుక్త కార్యదర్శి పడాల శ్రీను, యూనియన్ సభ్యులు కే.ఆశీర్వాదరావు, ఎండి.షబ్బీర్, సారా బాయి, చిన్న, రమేష్, అలీ, పాల్గొన్నారు.